సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 10 । మార్చి । 2024



ఇక చదవాల్సిందే..

గ్రూప్–1,2,3 పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ ఇటీవలే ప్రకటించింది. ఈ క్రమంలో పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు నిరుద్యోగులు సిద్ధమయ్యారు. 8లో▸



ఆలయాల్లో భక్తుల సందడి

మహాశివరాత్రి పురస్కరించుకొని నార్నూర్ మండలంలోని చోర్గవ్‌లో ఆధ్యాత్మికత సంతరించుకుంది. జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రతతో పాటు ఉక్కపోత పెరగనుంది.

న్యూస్‌రీల్

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా ఆశమ్మ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా మంచికట్ల ఆశమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కలాంబ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు ప్రకటనలో తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రేపు రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష

కైలాస్‌నగర్: రంజాన్ పండుగ పురస్కరించుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఈ నెల 11న జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

సమ్మెబాటలో రిమ్స్ కార్మికులు



సమ్మెకు మద్దతు తెలుపుతున్న విలాస్

ఆదిలాబాద్‌టౌన్: తమకు కాంట్రాక్టర్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదంటూ రిమ్స్‌లో పనిచేసే కార్మికులు సమ్మెబాట పట్టారు. శనివారం రిలే దీక్షలు చేపట్టారు. వీరికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రిమ్స్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్ కేర్‌ల జీతాల నుంచికాంట్రాక్టర్ ప్రతినెల దాదాపు రూ.2వేల వరకు కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. విషయాన్ని జిల్లా అధికారులతో పాటు డీఎంఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్, రాజు, ఎక్బాల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



జాతర్లలో చేతిపంపు మరమ్మతును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్

బజార్‌హత్నూర్: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. మండలంలోని పిప్రి, గిర్నూర్, బజార్‌హత్నూర్, జాతర్ల గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు, నర్సరీలతో పాటు సెగ్రిగేషన్ షెడ్లను శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నుల వసూలు లక్ష్యాన్ని మార్చి 31లోగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో నీటి ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని, అలాగే వినియోగంలో లేని చేతిపంపుల మరమ్మతు పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎంపీవో అతుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఇవి ఆదిలాబాద్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్‌ను ఆనుకుని కొంతమంది వ్యాపారులు అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలు. ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నా బల్దియా, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడి పూర్వపు ఎస్సీ సంక్షేమ బాలికల వసతిగృహం వద్ద ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భవనం నిర్మిస్తే తమ టేలాలు తొలగించాల్సి వస్తుందనే ఉద్దేశంతో అక్రమార్కులు రాజకీయ అండదండలతో నిర్మాణ పనులు జరగకుండా అడ్డుకోవడం గమనార్హం.



ఖాళీ జాగా... వేసేయ్ పాగా!



ఆదిలాబాద్ జెడ్పీ కార్యాలయ ప్రహరీని ఆనుకుని ఐదు రోజుల క్రితం అక్రమంగా వెలిసిన టేలాలు ఇవి. కొంతమంది రాజకీయ అండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధం చేసుకుంటున్నారు.

- ఆదిలాబాద్‌లో ఆగని ఆక్రమణలు
- ఖాళీ స్థలం కనిపిస్తే చాలు టేలా వేయడమే
- చోద్యం చూస్తున్న బల్దియా

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో సాగుతున్న ఆక్రమణల తీరుకు ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. అక్కడ.. ఇక్కడ తేడా లేకుండా పట్టణంలో ఖాళీస్థలం కనిపిస్తే చాలు దర్జాగా టేలాలు వేసి ఆక్రమించేస్తున్నారు కొందరు. రాజకీయ అండదండలతో బల్దియా నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే అక్రమ దందాకు తెరలేపుతున్నారు. ఈ ఆక్రమణలతో రోడ్లు కుచించుకుపోయి ఫుట్‌పాత్‌లేక పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి

గ్రేడ్–1 స్థాయికి ఎదిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి మాట అటుంచితే ఆక్రమణల పర్వం మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. పట్టణంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు అందులో టేలాలు వేసేస్తున్నారు. ఎన్టీఆర్ చౌక్ నుంచి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు గల పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఇదే పరిస్థితి. అలాగే జెడ్పీ కార్యాలయ సమీపంలో, రెవెన్యూ గార్డెన్‌నుంచి జగ్జీవన్‌రాం చౌక్ వరకు, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ప్రహరీని ఆనుకుని కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు, సాత్నాల బస్టాండ్ నుంచి మసూద్ చౌక్ వరకు ఇలా పట్టణంలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలో ఎటూ చూసిన అక్రమంగా వేసిన టేలాలే దర్శనమిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు నివాసముండే ప్రాంతాలను సైతం వదలడం లేదు అక్రమార్కులు. గాంధీపార్కు, స్టేడియం ప్రహరీని ఆనుకుని టేలాలు వేసి చికెన్, మటన్ సెంటర్లతో పాటు కొబ్బరి బొండాల విక్రయ కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ఇతరులకు అద్దెకు ఇస్తూ అక్రమంగా ఆర్జిస్తున్నారు. పట్టణంలోని మడిగెలను అద్దెకు తీసుకోవాలంటే ఆయా ప్రాంతాల ప్రకారం రూ.4వేల నుంచి రూ.15వేల వరకు పలుతుకున్నాయి. అంతగా చెల్లించలేని వ్యాపారులు కొంతమంది ఇలా అక్రమార్కులు వేసిన టేలాలను అద్దెకు తీసుకుని నెలకు రూ.3వేల నుంచి రూ.6వేల వరకు వారికి చెల్లిస్తున్నారు. పట్టణంలోని ఒకరిద్దరు స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రధాన ప్రాంతాల్లో 10 నుంచి 15 ఇలాంటి అక్రమ టేలాలు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ప్రేక్షకపాత్రలో బల్దియా

అక్రమంగా వేసిన టేలాలు, వారు చేపట్టే వ్యాపార కార్యకలాపాలతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. ఆ షాపుల వద్దకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను రహదారులపైనే పార్కింగ్ చేస్తుండటంతో ఫుట్‌పాత్‌పై నడిచే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా బల్దియా యంత్రాంగం 'మామూలు'గా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్పెషల్ డ్రైవ్ చేపడుతాం..

మున్సిపల్ స్థలాల్లో అనుమతి లేకుండా టేలాలు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం. వాటిని పూర్తిగా తొలగిస్తాం. ఈమేరకు పోలీసుల సహకారం కోరుతూ లేఖ రాస్తాం. మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. అలాగే అక్రమ నిర్మాణాలకు సంబంధించి విద్యుత్ కనెక్షన్ విషయంపై ట్రాన్స్‌కో అధికారులకు కూడా మున్సిపల్ ద్వారా లేఖ రాస్తాం.

– ఎండీ.ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

వీడని సందిగ్ధం

- ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌పై ఉత్కంఠ
- ఇంకా ఖరారు కాని ప్రధాన పార్టీల అభ్యర్థులు
- బీజేపీలో 'గొడం' చేరుతారనే ప్రచారం
- టికెట్ నాకే అంటున్న 'సోయం'
- కాంగ్రెస్ తొలి జాబితాలో ఆదిలాబాద్ పెండింగ్
- వేచి చూస్తున్న బీఆర్ఎస్



సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఆయా పార్టీల నుంచి అభ్యర్థి ఎవరు బరిలో నిలుస్తారనే విషయంలో ఇంకా సందిగ్ధం వీడటం లేదు. ఓ వైపు త్వరలోనే నోటిఫికేషన్ రావచ్చనే సంకేతాలు వెలువడుతుండగా టికెట్ ఖరారు విషయంలో ఉత్కంఠ పెరుగుతోంది. ప్రధానంగా గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానం నుంచి గెలుపొందిన బీజేపీ విషయంలోనే అభ్యర్థి ఎవరు అనే విషయం ఆసక్తి కలిగిస్తుంది. సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకే టికెట్ ఇస్తారా.. లేని పక్షంలో మరో ఆదివాసీ నేతకు చోటు కల్పిస్తారా అనేది చర్చకు దారితీస్తుంది.

గొడం చేరుతారనే ప్రచారం..

మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సీనియర్ నేత గొడం నగేశ్ బీజేపీలో చేరుతారనే ప్రచారం రెండు రోజులుగా విస్తృతంగా సాగుతోంది. ఈ నెల 12న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్ రానుండగా అదే రోజు నగేశ్ కాషాయం కండువా కప్పుకుంటారని పార్టీలో చర్చ మొదలైంది. అయితే ఆ లోపే కమలం పార్టీ రెండో జాబితా వస్తుందా.. లేదా అనేది ఆసక్తికరమే. కొద్ది రోజుల క్రితం అమిత్‌షా, ఇటీవల పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి బీఎల్ సంతోశ్‌ను కలిసిన ఎంపీ సోయం మాత్రం టికెట్ తనకే వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. ఢిల్లీ నేతలు తన పట్ల పాజిటీవ్‌గా ఉన్నారని అంటున్నారు. కాగా శనివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని సోయం కలిశారు. రెండో జాబితాలో పేరుంటుందని భరోసా ఇచ్చారని బాపూరావు 'సాక్షి' ఫోన్‌లో పలకరించినప్పుడు పేర్కొన్నారు. ఈ పరిణామాలన్ని ఆసక్తి కలిగిస్తున్నాయి. రెండో జాబితా లేని పక్షంలో అమిత్‌షా పర్యటనతో ఈ సందిగ్ధానికి తెరపడుతుందా చూడాల్సిందే.

చడీచప్పుడు లేని బీఆర్ఎస్..

బీఆర్ఎస్‌లో ఈ ఎన్నికలకు సంబంధించి చడీచప్పుడే లేదు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఈ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలోకి దించుతారని ముందు నుంచి ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీకి చెందిన గొడం నగేశ్ బీజేపీ వైపు దృష్టి సారించారని చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన భుక్యా జాన్సన్ నాయక్ కూడా పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారనే ప్రచారం ఉంది. కాగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఖరారు తర్వాత పార్టీ నుంచి అభ్యర్థిని స్పష్టం చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అక్కడ లంబాడా..

ఇక కాంగ్రెస్ తొలి జాబితా శుక్రవారం విడుదలైంది. రాష్ట్రం నుంచి నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అందులో మహబూబాబాద్ నుంచి లంబాడా సామాజిక వర్గానికి చెందిన బలరాం నాయక్‌కు టికెట్ కేటాయించారు. ప్రధానంగా పార్టీల పరంగా ఈ రెండు ఎస్టీ నియోజకవర్గాలకు సంబంధించి అక్కడ ఒకరికి కేటాయిస్తే ఇక్కడ మరొకరికి కేటాయిస్తారని ఉంది. దీంతో కాంగ్రెస్ నుంచి ఆదిలాబాద్‌లో ఆదివాసీకే టికెట్ కేటాయింపు ఉంటుందని పార్టీలో చర్చ సాగుతుంది. ఇదిలా ఉంటే బీజేపీ పరంగా మహబూబాబాద్ నుంచి మాజీ ఎంపీ సీతారాం నాయక్‌కు ఇవ్వనున్నారనే ప్రచారం సాగుతుండగా ఆదిలాబాద్‌లో ఆ పార్టీ కూడా ఆదివాసీకే టికెట్ ఇవ్వనున్నారనేది స్పష్టం అవుతుంది.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

- జిల్లాకు తొలి విడతలో 7,400 మంజూరు
- సొంత స్థలాలు ఉన్న వారికి ప్రాధాన్యత
- ఈ నెల 11న రాష్ట్రస్థాయిలో పథకం ప్రారంభం



కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా కీలకమైన మరో పథకం అమలుపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది. పేదల సొంతింటి కల సాకారం చేసేలా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించనున్నట్లుగా ప్రకటించింది. అలాగే జిల్లాల వారీగా మంజూరు చేసే ఇళ్ల సంఖ్యపై కూడా స్పష్టతనిచ్చింది. తొలి విడతలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేయాలని భావిస్తోంది. వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అదే పథకానికి శ్రీకారం చుట్టేందుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో సొంతిల్లు లేని నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లాకు 7400 ఇళ్ల మంజూరు

తొలి విడతలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ లెక్కన ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాలకు కలిపి 7000 ఇళ్లు మంజూరు కానున్నాయి. అయితే జిలాలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలు ఖానాపూర్ నియోజకవర్గంలో, గాదిగూడ, నార్నూర్ మండలాలు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఉండటంతో వాటికి అదనంగా మరో 400 ఇళ్లు మంజూరయ్యే అవకాశమున్నట్లుగా గృహనిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఇళ్లను ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా మంజూరు చేసే అవకాశమున్నట్లుగా పేర్కొంటున్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగిన పేదలకు మాత్రమే మంజూరు చేసే అవకాశమున్నట్లుగా చెబుతున్నారు. ఇది వరకే ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో మరోసారి సర్వే నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేసే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సొంత స్థలం కలిగిన వారికే ప్రాధాన్యత

సొంత స్థలం కలిగి ఉండి, ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికే తొలి విడతలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. అయితే ఈ నగదు మొత్తం ఒకే విడతలో కాకుండా ఇళ్ల నిర్మాణాలు సాగిన కొద్ది అందజేస్తారు. ఇందిరమ్మ ఇళ్లన్నింటినీ గతంలో మాదిరిగానే ఒకే నమూనాలో నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నెల 11న ఇంటి నిర్మాణాల నమూనాలను ప్రభుత్వం వెల్లడించే అవకాశముంది. అయితే ఇంటికి వంట గది, మరుగుదొడ్డి తప్పనిసరి చేయనుంది. సర్కారు సర్వేలో అర్హులై ఉండి, సొంత స్థలాలు లేనటువంటి వారికి ప్రభుత్వమే తర్వాత స్థలాలు కొనుగోలు చేసి పంపిణీ చేయనుంది. ఆ తర్వాత వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. తొలి విడతలోనే ఇళ్లను దక్కించుకునేందుకు పలువురు తమ ప్రయత్నాలు షురూ చేశారు. అయితే గత ప్రభుత్వం మాదిరిగా రాజకీయ నాయకుల సూచనలకనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా లేక లక్కీ డ్రా ద్వారా అర్హులను గుర్తిస్తారా అనేది 11వ తేదీ తర్వాత స్పష్టత రానుంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న ప్రారంభిస్తోంది. ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను మంజూరు చేస్తోంది. సొంతింటి స్థలం కలిగిన వారికి మాత్రమే తొలి విడతలో ప్రాధాన్యతనివ్వనున్నట్లుగా తెలిసింది. అర్హుల ఎంపిక, ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధానం, నగదు చెల్లింపులు వంటి వివరాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అవి అందిన వెంటనే తదనుగుణంగా చర్యలు చేపడుతాం.

– బసవేశ్వర్, హౌసింగ్ నోడల్ ఆఫీసర్

'అద్దె ఎగనామం'పై

స్పందన

- 'సాక్షి' కథనానికి స్పందించిన కమిషనర్
- బకాయిలు చెల్లించని షాపులకు నోటీసులు
- 15 రోజుల్లోగా చెల్లించకుంటే కఠిన చర్యలు



ఓల్డ్‌బస్టాండ్‌లోని చికెన్ సెంటర్ నిర్వాహకుడికి నోటీసు అందజేస్తున్న బల్దియా సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్‌కు సంబంధించిన వ్యాపార సముదాయాల్లోని మడిగెల అద్దెలను వ్యాపారులు ఏళ్ల తరబడి చెల్లించని వైనాన్ని వివరిస్తూ ఈ నెల 6న 'అద్దె ఎగనామం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ స్పందించారు. రూ.కోట్లాది బకాయిలు చెల్లించాల్సి ఉన్న ఓల్డ్ బస్టాండ్, శివాజీచౌక్ ప్రాంతాల్లోని మడిగెలతో పాటు మున్సిపల్ పాత కార్యాలయం కింద గల పలు దుకాణాలను ఆయన అదే రోజు సందర్శించారు. షాపుల వారీగా చెల్లించాల్సిన అద్దె బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిదారులందరికీ నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రంగంలోకి దిగిన సిబ్బంది షాపుల వారీగా చెల్లించాల్సిన బకాయి వివరాలతో కూడిన నోటీసులను రెండు రోజులుగా అందజేశారు. మరో ఐదారు షాపులకు జారీ చేయాల్సి ఉందని, ఆదివారంలోగా పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. 15 రోజుల్లోగా వ్యాపారులు అద్దె బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో షాపులు సీజ్‌తో పాటు చట్టపరంగా చర్యలు తప్పవని వారు పేర్కొంటున్నారు.

మైనార్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కమిటీని సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మైనార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఆదిల్ షరీఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలో అసోసియేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని పేర్కొన్నారు. డీఎస్సీలో ఉర్దూ పోస్టుల భర్తీలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 200కు పైగా ఖాళీలు ఉన్నప్పటికీ కేవలం 50పోస్టుల వరకే వెకెన్సీ చూపించారన్నారు. విద్య, వైద్య, ఇతర శాఖ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా డాక్టర్ సమియొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా రిహాన్ షరీఫ్ (ఏఈ), కోశాధికారిగా ఎంఏ సమి, సహాయ కార్యదర్శిగా ఫయాజ్ అహ్మద్, మీడియా కార్యదర్శిగా రియాజ్, మహిళ కార్యదర్శిగా తహినియత్ జబీన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం అడ్‌హక్ కమిటీని సన్మానించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మోసిన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మజీద్ ఖాన్, హబీబ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, కార్మికులు

ఆదిలాబాద్: 2017 పీఆర్‌సీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంపై ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద శనివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ తదితరుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉద్యోగుల జీతభత్యాల విషయంలో తీవ్ర అన్యాయం చేసిందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఫిట్‌మెంట్ ప్రకటించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెండింగ్ బెనిఫిట్స్ కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆశమ్మ, పట్టణ అధ్యక్షుడు నగేశ్, సీనియర్ నాయకులు సంతోష్, భూమరెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి డి.వి బాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అనిల్, గ్యారేజ్ ఇన్‌చార్జి మాధవ్, కేజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

13న ఉద్యోగ మేళా

ఇచ్చోడ: ఈ నెల 13న ఉట్నూర్‌లో గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జేఆర్పీ ముకుంద్ తెలిపారు. ఉదయం 11గంటలకు ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆధ్వర్యంలో మేళా నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువతి, యువకులు విద్యార్హత, కుల ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా ఉద్యోగం చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఈ ఉద్యోగ మేళాకు హైదరాబాద్‌లోని 15 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై వెయ్యి ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో నాగేంద్రుడి దర్శనం



ఆలయ గర్భగుడిలో నాగుపాము

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల గొండు గూడాలోని రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం అర్ధరాత్రి నిర్వహించారు. మరోవైపు భక్తులు జాగరణ, భజన చేస్తుండగా లింగోద్భవ సమయంలో ఆలయ గర్భగుడిలో నాగుపాము దర్శనమిచ్చింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

లింగాపూర్‌లో దొంగతనం



గదిని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం: మండలంలో లింగాపూర్ గ్రామానికి చెందిన చేపూరి నవ్య ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మహాశివరాత్రి సందర్భంగా నవ్య పక్కనే ఉన్న అత్తమ్మ రూంలో పడుకుంది. తెల్లవారి చూసేసరికి ఇంటి, బీరువా తాళం పగులగొట్టి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం సంఘటన స్థలాన్ని ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ధ్వంసం

సిరికొండ: మండల కేంద్రంలో ఇంటి ఎదుట ఉంచిన బైక్‌ను దుండగులు ధ్వంసం చేశారు. మండల కేంద్రానికి చెందిన దోండే కాశీనాథ్‌కు చెందిన బైక్‌ను తన నివాసం ఎదుట ఉంచగా గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇనుపరాడ్‌తో దాడిచేసి బైక్‌ను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

ఇక చదవాల్సిందే..

- గ్రూప్స్ ఉద్యోగ పరీక్షలకు తేదీలను ఖరారు చేసిన టీఎస్‌పీఎస్సీ
- జిల్లా కేంద్రాల్లోని స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణకు ప్రభుత్వం ఏర్పాటు
- ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉద్యోగం పొందే అవకాశం
- ఉత్తమ ప్రణాళికే విజయానికి సోపానం



బోథ్: గ్రూప్- 1, గ్రూప్- 2, గ్రూప్- 3 ఉద్యోగాల పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ ఇటీవలే ప్రకటించింది. గ్రూప్- 1 ఈ ఏడాది జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21న మెయిన్స్, ఇక గ్రూప్- 2ను ఆగస్టు 7, 8వ తేదీల్లో, గ్రూప్- 3 నవంబర్ 17,18 తేదీల్లో నిర్వహించనున్నారు. దీంతో నిరుద్యోగులు ఉద్యోగ ప్రిపరేషన్‌లో నిమగ్నమయ్యారు. సమయాన్ని వృథా చేయకుండా, ప్రణాళికాబద్ధంగా చదవితే విజయం సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే నిరుద్యోగులకు కోచింగ్ ఇవ్వడానికి జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిల్‌లను ఏర్పాటు చేస్తోంది.

అత్యుత్తమ ప్రణాళిక ఉండాలి..

చాలా మంది నిరుద్యోగులు గ్రూప్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనర్చి ఉద్యోగం సాధించాలనే ప్రణాళికబద్ధంగా చదవాల్సిన అవసరం ఉంది. నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక సర్వశక్తులూ కూడగట్టాల్సిన సమయం. సమస్యలు పక్కనపెట్టి, పరిమితులు దాటుకుని, బలహీనతలను అధిగమించాల్సిన అవసరం ఉంది. తమ లక్ష్యాన్ని ఎక్కుపెట్టి ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు చదవాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్ని గంటలు చదవడానికి వెచ్చించాలి.. ఎంత సాధన చేయాలి.. ఎన్ని గంటలు ప్రయత్నం చేయడానికి ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలి. ప్రతి సబ్జెక్టు కూ టైమ్ టేబుల్ రూపొందించుకున్నట్లే పునశ్చరణ కోసం ప్రాధాన్యతనివ్వాలి. ఇక ఏకాగ్రత కోసం ప్రయత్నించాల్సి అవసరం ఉంది. ఏకాగ్రత సన్నిగిల్లకుండా చూసుకోవడానికి కొంత ధ్యానం చేయాల్సిన అవసరంర ఉంది.

వ్యసనాలు వీడాలి..

ప్రస్తుతం ఫోన్ ప్రతి ఒక్కరికి వ్యసనంగా మారింది. ఫోన్ చేతిలో లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితి. ఇక వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగాం వంటి సోషల్ మీడియాను దూరం పెట్టడం మంచింది. అవసరమైతే తప్ప ఫోన్‌ను ఉపయోగించకుండా ఉంటే చదవడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం చాలా మంచిది. ఇక ఇతర వ్యవనాలు ఉంటే పూర్తిగా పక్కన పెట్టడం ద్వారా ప్రిపరేషన్‌పై దృష్టి కేంద్రీకృతం చేయవచ్చు. ఇక ప్రతి విషయంపై నెగెటివ్‌గా ఫీల్ కాకుండా పాజిటివ్‌గా ఉండే ప్రయత్నం చేయాలి.

వర్తమాన అంశాలపై దృష్టిపెట్టాలి



ప్రణాళికబద్ధంగా చదవాలి. సాధ్యమైనంతవరకు గత ప్రశ్నాపత్రంలోని ప్రశ్నల సరళిని గమనిస్తూ ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. చదవడానికి సాధ్యమైనంత వరకు తగిన సమయాన్ని కేటాయించాలి. ముఖ్యంగా వర్తమాన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ప్రతి రోజు దిన పత్రికలను చదవుతూ ఉండాలి. పత్రికలోలని ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. కఠినమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– గొడిసెల రమణగౌడ్, సీనియర్ జీకే, కరెంట్ అఫైర్స్ ఫ్యాకల్టీ

ప్రత్యేక దృష్టి సారించాలి



సబ్జెక్టుల వారీగా ఎక్కువగా రివిజన్ చేయాలి. మాక్ టెస్టులను వీలైనంత ఎక్కువగా రాయాలి. సమకాలీన, వర్తమానంశాలను సబ్జెక్టులతో అనుసంధానం చేస్తూ చదవాలి. సమయం వృథా చేయవద్దు. ఏకాగ్రత దెబ్బతినకుండా చూసకోవాలి. పాజిటివ్‌గా ఆలోచించాలి. ఒత్తిడికి లోనుకావద్దు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చదవాలి.

– అల్లం సాయికృష్ణ, ఫిజికల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

సూర్యపూర్‌లో అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

- మహారాష్ట్ర వాసులదే పైచేయి



తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: మండలంలోని సూర్యపూర్ శ్రీరాజరాజేశ్వర ఆలయ ఆవరణలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మల్లయోధులు పాల్గొని పోటీల్లో తలపడ్డారు. ఇందులో మహారాష్ట్ర వాసులు విజయం సాధించారు. సూర్యపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో మొత్తం 182 కుస్తీపోటీలు నిర్వహించగా ఇందులో సుమారు 400 మంది మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. చివరి కుస్తీ పోటీలో నాందేడ్ జిల్లా బోకర్ తాలూకాలోని డెగ్లూర్‌కు చెందిన కిరణ్, నాందేడ్ జిల్లా బోకర్ తాలూకాలోని బిద్రాలికి చెందిన సాయినాథ్ తలపడ్డారు. ప్రథమ విజేతగా సాయినాథ్ నిలువగా రూ.6,100 నగదుతో పాటు వెండి కడియం, రెండో విజేతగా నిలిచిన కిరణ్‌కు రూ.3వేల నగదు శాలువాతో గ్రామస్తులు సన్మానించారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జాదవ్ రాజేష్ బాబు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భైంసాలో యువకుడి హత్య



సయ్యద్ సోహెల్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని సాయికాటన్ ప్రాంతంలో సయ్యద్ సోహెల్(24) హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓవైసీనగర్‌కు చెందిన సోహెల్ శనివారం సాయంత్రం వస్తుండగా సాయి కాటన్ ప్రాంతంలో అదే సామాజిక వర్గానికి చెందిన మరో యువకుడు అతడిని అడ్డగించి స్క్రూడ్రైవ్ లాంటి పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో ఛాతి, ముఖం, నడుం వద్ద తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మట్కా ఆడుతున్న ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్‌చౌ క్ వద్ద శనివారం మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కళ్యాణ్ తెలిపారు. డీఎస్పీ కరుణాకర్, సీఐ శంకరయ్య ఆదేశాల మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎండీ సాహిద్, మరో బాలుడు తమ సెల్‌ఫోన్‌లలో ఆన్‌లైన్ మట్కా ఆడుతూ పట్టుబడినట్లు ఎస్సై పే ర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫో న్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన ట్లు వివరించారు. మట్కా జూదం ఆడితే కఠి న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో ఎస్సై రాజు

లోకేశ్వరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని హవర్గ గ్రామ శివారులో ప్రాంతంలోని సుద్ద వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

అదుపుతప్పి పండ్ల వ్యాన్ బోల్తా



గుడిపేట వద్ద బోల్తా పడిన వ్యాన్



పండ్లు తీసుకెళ్తున్న స్థానికులు

- పండ్లకోసం ఎగబడిన జనాలు
- నిమిషాల్లోనే వ్యాన్ మొత్తం ఖాళీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అదుపుతప్పి పండ్ల వ్యాన్ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని యావత్‌మాల్‌లో శనివారం వ్యాన్‌లో బత్తాయి పండ్లు లోడ్ చేసుకుని మంచిర్యాల మార్కెట్‌కు బయలుదేరింది. హాజీపూర్ మండలం గుడిపేటలోని దుబ్బపల్లి జాతీయ రహదారి వరకు రావడంతో దుబ్బపల్లికి చెందిన ముడిమడుగుల వెంకటేశ్ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటే క్రమంలో పండ్ల వ్యాన్ రావడాన్ని గమనించి ఒక్కసారిగా బైక్ ఆపేశాడు. ఒక్క సారిగా ఆందోళనకు గురైన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వ్యాన్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. గమనించిన స్థానికులు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు సైతం 'సందెట్లో సడేమియా'గా బత్తాయి పండ్లను పది నిమిషాల్లోనే ఖాళీ చేశారు. సదరు పండ్ల వ్యాపారికి దాదాపు రూ.లక్షకు పైగానే నష్టం వాటిల్లి ఉంటుందని పలువురు గుసగుసలాడుకోవడం కొసమెరుపు.

అర్బన్‌పార్క్‌లో మంటలు



వ్యాపించిన మంటలు

నేరడిగొండ: బోథ్ ఎక్స్‌రోడ్ వద్ద గల అర్బన్‌పార్క్‌లో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులతో పాటు సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రాత్రి కావడంతో ఇచ్చోడ నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం ద్వారా మంటలను ఆర్పివేశారు. ఎంత నష్టం వాటిల్లిందో తెలియరాలేదు. ఆదివారం తెలియజేసే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఏదేమైనా ఇది ఆకతాయిల పనే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మద్యం దొంగల అరెస్ట్

- సీసీ పుటేజీల ఆధారంగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు అరెస్ట్, పరారీలో మరో నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సిఐ ఫణీందర్

తాంసి: మండల కేంద్రంలోని వైన్స్‌షాప్‌లో మద్యం చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా 48గంటల్లో పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ ఫణీందర్ నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలోని మాధవి వైన్స్ షాపుపైన రేకులను తొలగించి మద్యం ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం వైన్స్‌షాప్‌ను తెరచిన సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకోగా నిజం ఒప్పుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గుగ్గిల పోశెట్టి, షేక్ సోహెల్, గుండగాని మహేందర్, సెడ్మాకి శ్రీకాంత్ నలుగురు వైన్స్‌షాప్‌లో దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించారు. వీరిలో పోశెట్టి, షేక్ సోహెల్, మహేందర్‌ను అరెస్ట్ చేయగా శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు గత నెల 22, 24, 27వ తేదీలతో పాటు ఈ నెల 2వ తేదీన సైతం దొంగతనానికి పాల్పడినట్లు సీసీ టీవీలో గుర్తించారు. అయితే పోశెట్టి మండల కేంద్రంలోనే బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నిత్యం మాధవి వైన్స్‌లో నుంచి మద్యం తీసుకెళ్లేవాడు. అందులోనే దొంగతనం చేసేందుకు పక్కాగా ప్లాన్ చేసి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వరుసగా వైన్స్‌షాప్ పైన రేకులను తొలగిస్తూ దొంగతనానికి పాల్పడ్డాడు. మొత్తం రూ.2లక్షల విలువైన మద్యం దొంగలించి విక్రయించినట్లు గుర్తించారు. దాచిపెట్టిన మద్యం పాటు నగదు సీజ్ చేశారు. ఇందులో తలమడుగు ఎస్సై ధనశ్రీ, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, కానిస్టేబుల్ చిరంజీవి, రమణ ఉన్నారు.

ప్రజల ఆశలు ఆవిరి చేసిన మోదీ

- ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం నేర్పాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఎదులాపురం: జిల్లా ప్రజల ఆశలను భారత ప్రధాని మోదీ ఆవిరి చేశారని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి తగు గుణపాఠం నేర్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మోదీ స్థానిక దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుతారని జిల్లావాసులు ఎంతో ఆశగా ఎదురు చూశారని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే సీసీఐ తెరిపిస్తామని, ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్, గిరిజన యూనివర్సిటీ, జిల్లా కేంద్రంలో విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వారి హామీల మేరకు జిల్లా ప్రజలు ఎంపీగా గెలిపించడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఈ మారు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి 4 ఎమ్మెల్యేలుగా గెలిపించడం జరిగిందన్నారు. ప్రధాని మోదీ జిల్లా సమస్యల పరిష్కారం దిశగా హామీ వర్షం కురిపిస్తారని ఎదురు చూసిన జిల్లా ప్రజలకు ఆయన మొండి చేయి చూపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవలు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న మంజుల పాల్గొన్నారు.

నేరస్తుడిని పట్టించిన సీసీ కెమెరా

- రాచాపూర్‌లో నెలరోజుల వ్యవధిలో నాలుగు బైకులు దగ్ధం
- పాత పగతో నిందితుడి ఘాతుకం
- యువకుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

లక్ష్మణచాంద: వరుసగా బైక్‌ల దగ్ధం కేసులో సీసీ కెమెరాలు నిందితుడిని పట్టించాయి. తన అన్నకు గ్రామస్తులకు మధ్య జరిగిన పాత గొడవలు మనసులో పెట్టుకొని గ్రామంలో నలుగురు వ్యక్తులకు సంబంధించిన బైకులను తగలబెట్టిన మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన యువకుడు పట్టుబడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన భూషి సాయికుమార్ అనే యువకుడు నెలరోజుల వ్యవధిలో తన అన్నతో గొడవ పెట్టుకున్న వ్యక్తుల కదలికలు గమనించాడు. నెలరోజుల క్రితం అర్ధరాత్రి గ్రామంలో అందరూ గాఢనిద్రలో ఉండగా అదే గ్రామానికి చెందిన దాసరి అశోక్ బైకును పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తర్వాత వారం వ్యవధిలో అదే గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్, రాందేని మహేష్‌ల పల్సర్ బైకులను తగలపెట్టాడు. శుక్రవారం అర్ధరాత్రి 2:30 గంటలకు అదే గ్రామానికి చెందిన ఈర్ల ముత్యం బైక్‌కు నిప్పంటించి పారిపోగా బాధితుడి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న కెమెరాలో, మరో వ్యక్తి ఇంటి వద్ద సీసీకెమెరాలో రికార్డు అయింది. దీంతో పోలీసులు నిందితుడిని గుర్తించి సోన్ సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి దగ్గర నుంచి పెట్రోల్ బాటిల్, నేరం చేసిన సమయంలో ధరించిన దుస్తువులు, అగ్గిపెట్టె స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి శనివారం న్యాయస్థానంలో హాజరుపరిచగా 10రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కృషి చేసిన సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు కిరణ్, భీమేష్, సాయి, సునీల్‌లను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

'రణ స్వరం' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న కవి శివారెడ్డి




నారాయణను సన్మానిస్తున్న కవయిత్రి సులోచన

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన కవి బొల్లారం బాబన్న రాసిన రణ స్వరం అనే కవితా సంపుటిని ప్రసిద్ధ కవి కె.శివారెడ్డి శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిలో కలిగే భావాలను ఎదుటి వాళ్లకు చెప్పడమే కవిత్వమన్నారు. మరెన్నో కవితా సంపుటాలు రచించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీరాములు, రూప్‌కుమార్ డబ్బీకర్, వాసిరెడ్డి నవీన్, ఉదారి నారాయణ, ఎంపెల్లి లక్ష్మీనారాయణ, గంగన్న, త్రివేణి, ఇందిర పాల్గొన్నారు.

జిల్లా కవికి పుస్తకం అంకితం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణకు కవయిత్రి గడ్డం సులోచన రచించిన సులోచనానీలు అనే పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ప్రసిద్ధ కవి ఆచార్య ఎన్.గోపి ఆవిష్కరించారు. కవయిత్రి సులోచన కవి ఉదారి నారాయణ క్లాస్మేట్స్ కావడం గమనార్హం. కవి నారాయణపై ఉన్న అభిమానంతో పుస్తకాన్ని ఆయనకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆదినారాయణ, వంశీధర్, లక్ష్మీనారాయణ, కవులు బాబన్న, గంగన్న, ఇందిర, దేవేందర్, త్రివేణి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

'అడెల్లి'లో నిజామాబాద్ మేయర్ పూజలు



పూజలో పాల్గొన్న నీతూ కిరణ్

నిర్మల్: జిల్లాలోని సారంగపూర్ మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్ నీతూ కిరణ్ శనివారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. బాలాలయంలో మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జైనూర్: ఈ నెల 2న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పారా గ్రామానికి చెందిన కినక బాపురావు (35) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ నెల 2న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.